25
1967 - 1991

# కల్లమయిపాయ



—శాంతి నారాయణ

సందేల కావొచ్చింది. దురగప్పా, మారెప్పా తప్పెట్లు గొడతాం డారు. రామన్న సన్నమేలం వూత్తాండాడు. వాని కొడుకు సుతి బోస్తాండాడు. వూరి మద్దెన, పీర్లసావిడి దెగ్గిర జనమంతా గుంప యినారు. సాకలి తిప్పన్న గాడిదలు తోలుకోనొచ్చినాడు. ఆడోళ్ళు రాగి తట్టలో పసుపూ,

కుంకుమా, పూలారాలూ బెట్టుకొని నిలబడ్నారు.

ఇద్దురు సల్లాడ మోళ్ళొచ్చి పసుపూ కుంకుమా గాడిదల మొగాల మింద బెట్టి పూలారాలు మెల్లో యేసినారు. పిళ్లాజల్లా అంతా యిండ్లల్లో వుండే కుండా, సటికా,పాత పరకలూ, చాట్లూ,

పొప్పుగిత్తెలూ, తెడ్డు కట్టెలూ, పాత గోని పట్లూ అన్నీ తెచ్చి పెట్టుకుం డారు. పాయం పిల్లోళ్ళు కొంత మంది పాత మంచాలు నెత్తిమిందికెత్తు కుండారు. పెద్దోళ్ళు యెనకల నిలబడ్నారు.

తప్పెట్లు ముందుకెల్ల వార్నాయి. వూరవాకిలి దెగ్గిర బొడ్రాయికి ఆడోళ్ళు నిండు గడవల్తో నీళ్ళు బోసినారు. 'సల్లంగ సూడు వాన్దేవుడా' అని మొక్కుండారు. పిల్లోళ్ళు నవ్వుతా ఆడతా పాడతా నడుస్తాండారు. పెద్దోళ్ళంతా తలకాయి లొంచుకొని పోతాండారు. వూరేగింపు వూరు దాటి దొడ్లు దాటి కంకర్రోడ్డు మిందికెక్కింది.

సుట్టూరా చేన్లు. సద్దసేన్లు పొట్టకొచ్చి వాడు బట్టి యాలబడినాయి. కొర్రసాళ్ళు జానెడు బెరిగి నేల బట్నాయి. శెనిక్కాయి చెట్లు యెండి పోయిన ఆకుల్తో గలగల మంటాండాయి.

గుంపంతా వూరి పొలిమేర దెగ్గిర జేరుకుంది. పెద్దోళ్ళు చెప్పినట్లు అందురూ పాత సామాన్లు పొలిమేరవతల పారేసినారు. గాడిదల మెల్లో పూలా రాలు తెంపేసినారు. వాన్దేవునికి మొక్కొని



యెనిక్కి దిరిగినారు. మవునంగా వూర్లేకి జేరుకుండారు. చీకటి పడింది.

"ఇరాట పరవం జదువుతారంటా, అందురూ బోజినాల్జేసినంక సావిడి దెగ్గిరకి రావల్లంటప్పో"

అంటా దురగప్ప చాటింపేసినాడు. పెద్దోల్లంతా చావిడి దెగ్గిరకి జేరుకుండారు. బాపనయివారు ఇరాట పరవం జదివి అర్తం చెప్పుతాండాడు.

"ఈ పొద్దుటికి సామి యిరాట పరవం జదవబట్టి పద్దినాలయితుంది మామా, వానేమో వొంగలే"

"వొంగుతాదోయొంగుతాది. ఆత్తరపడితే యట్ట? అర్జునుడు గోవుల్దిప్పేలోపల వొంగుతాది. పెద్దోల్లూరకనే జెప్పినారా"

"బెనకప్ప పండగ్గూడా పాయిగిదన్నా. వాన పలకవే లేకపాయ"

"బెనకప్ప కడుపు నిండా తిని పొయి యాడబందుకుండాడో యేమో! మాల పున్నమ రావల్సిందే. యెముకర్దిని నోట్లో అడ్డంబడి నీళ్ళకోసం జోకు మారుడరిస్తే గానీ వాన్రాదు సన్నా. పెద్దోల్లూరకనే జెప్పినారా"

యెనకపక్క గుచ్చోని తలాకొగమాట మాట్లాడతాండారు. అయివారు జెమ్మి సెట్టు దెగ్గిరికి అర్జనుడు బొయేదంక కత జదివి సాలిచ్చినాడు.

** ** ** **

దావపక్కన గుంటిమిందగుచ్చోని బీడీ తాగుతా చేనికల్ల జూస్తాండాడు మల్లప్ప. ముంగారేసిన మిట్ట పట్టె రెండెకరాలూ యెండిపొయ్యింది. క్రొరంతా కాలిపొయినట్టయింది. సద్దకర్రలు పొట్టకొచ్చి మాడి పాయినాయి. తగ్గుపట్టె నాలుగెకరాలు బీళ్ళు బీళ్ళెండిపొయ్యింది.

అక్కిడికేసిన కందిచెట్లు ముదుసుకోని నేల్లోనే వుండాయి. బీడీ పొగతోపాటు లోపలుండే బరువంతా బయిటికిడిసినాడు మల్లప్ప.

"పదారా అన్నా, వూరకనే యాలజూత్తావ్! జూసినంతా కడుపులో సంగటు మయితాదో" దావుంటి బోతా పలకరిచ్చినాడు సుంకిరెడ్డి.

"యేం జేత్తామప్పా మల్ల. వూర్లేకి బోతే వుండ బుద్దిగాదు, ఈటికొత్తే సూడబుద్ది గాదు... యెంతన్నాయం జేసెనప్పా దేవుడూ" మల్లప్ప మదన పడ్డాడు. సుంకిరెడ్డి మల్లప్ప దెగ్గిరికి బోయి కుచ్చుండాడు.

"మొక్కార్తి బోయి పుబ్బకార్తొచ్చినా వానప లకవే లేక పాయుగిదన్నా. అంతా తెల్లమ్మాడానికి దిరుక్కుంది. యింగేమొత్తాది? పంచాంగంలో ఇసారి వాన దండిగావుందని జెప్పిరి. పీర్ల పండగనాడు బండమింద పల్లి ఆజీసామి మొక్కార్తిలో చెరువు నిండుతుందని జెప్పె. గాడిదలూరేగిచ్చి, బొండాయికి నీళ్ళు బోసి, ఆంజినెయి సామికి ఆకుపూజ జేయిచ్చి యెంత జేసినా వాన్దేవుడేమో కనికరించక పాయిగిదన్నా" అంటా బీడీ నలిపి, నోట్లో బెట్టుకుని, మల్లప్ప తాగే బీడీ యిప్పిచ్చుకుని, అంటిచ్చుకుండాడు సుంకిరెడ్డి.

"వానకు బలం లేనప్పుడు యాదేవుడు గాంగ యేం జెప్పుతాడప్పయా. అంతాసుల్లమాట్లు. మనగడ్డకే యేందో దరిద్దరం జుట్టుకుంది. వొగ సమ్మచ్చరం బండితే నాలుగేండ్లొరుపిత్తాంది.

ఇల్లయితే యెవసాయమెల్ల జేసుకోవల్లో యేమో! యాటికన్నా యెల్లిపొయ్యేది మేలప్పా."

"యాటకి బోతామన్నా, యాటికి బోయినా యింతే. నాలుగేండ్ల ముంచి కరువు జుట్టుకున్నా పెద్దోల్లకు సీమగుట్నెట్లుగుడాకాలే. గవుర్మెంటో ల్లేందన్నా పనన్నా సూపిత్తారేమో అనుకుంటే అతగాళ్ళు సీటు మింద గుచ్చుండేకి కుక్కలా కొట్లాడినట్ల కొట్లాడతాండారు. ఇంగెవురన్నా రైతును గురించి పట్టిచ్చుకుండేది?"

"యెవురు బట్టిచ్చుకుంటారప్పా, మనసావు మనం సాయల్సిందే. మనుసులకు తిండి లేకపోతే నాక్కోసొల్లొ తెచ్చుకోచ్చు. పసల మేపెట్ల జెయ్యల్లప్పా? యెవున్నడిగితే యిత్తారు?"

"యేమిడిడోనన్నా, గాటిపొట్న పసల గోడు జూత్తావుంటే పానం పిసుక్కున్నెట్లయితాది. పారదీసుకుని గంప నిండా గోకుడు గెడ్డన్నా గోక్కొత్తామంటే యాడా గెడ్డిపొసే లేదు, ఇంగెట్లా! శెనిక్కాయెండి పొయ్యింది. పసులన్నా తోల్దామనుకుంటే మూచ్చాసి తోల బుద్దిగాదు"

"యెట్ల తోలబుద్దయి తుందప్పా. ముంగారి పైరన్నా అయితే యేదోలే అనుకోచ్చు. అయిన్నూరుపాయిల పకారం అయిదారు మూట్లు శెనిక్కాయలెద్దిచ్చి, ఇత్తనాలొలిసి, బగవంతుని మింద బారమేసి బూమిలో గుమ్మరబోస్తిమి. పంట బాగుండల్లని వొగర్ని మించొగరు అంతింతరేట్లు బెట్టి డి.ఎ.పి., యూరియా లేసుకుంటిమి. చేతల కట్టమంతా యాటికన్నా బోల్లే, అన్నాలంగా అప్పు దెచ్చి బూమి పాల్జేసి అంగలార్చేటట్లాయ గిదప్పా" దిగులు పడతా పైకి లేసి నాడు మల్లప్ప.

** ** ** ** ** **

పుబ్బకార్తి పాయ. వానరాలే. జనమంతా ఉత్తర జూసి గంపెత్తల్లనుకుండారు. చెర్లోనల్లనేలంతా యెండకు నోర్లు దెరుసుకుని వొగిరిస్తాంది. బాయిలన్నీ యెండిపొయినాయి. ఇస్కూలు దెగ్గిరుండే

బోరింగులో నీళ్ళు రావడంలే. మరవం కలో యిసగ్గుంతలో చెంబుల్తో తోడుకుని, కడవల్లో బోసుకుని నీళ్ళెత్తకొచ్చుకుంటాండారు. వూరి సుట్టూరా దొడ్లన్నీ చెపుతో గొట్టిన మొగమాకట్ల యిగిలిచ్చుకోనుండాయి. వొగదొడ్లో గూడా బారెడు గెడ్డివాములేదు. వొగొగరు మెల్లిగా పసుల్ని దోలుకుని ప్యాపిలి సంతకు బోతాండారు.

మల్లప్ప పెద్దకొడుకు లింగన్న వుత్తబండి తోలుకుని యెనిక్కొచ్చినాడు. బండిపక్క జూసి మల్లప్ప సప్పగయినాడు.

"తూరుపు గుట్టలన్నీ మూసొత్తి నాయినా. యాడా తుంప గెడ్డిపొస లేదు. వంక గడ్డలన్నీ దిరిగితి. యాడ జూసినా నున్నగ దోక్కపొయినారు" అంటా లింగన్న గిత్తల్దిడిసి తొట్లో కడుగునీళ్ళు తాపిచ్చి కొట్టంలో గట్టేసినాడు. నడిపోడు కొండన్న మరవంకలో నుంచి దున్నపొతుల్నీ యెనుంపడ్డనూ తోలకొచ్చినాడు. దున్నపొతులు తొట్లో మిగిలిందే కడుగు నీళ్ళుగుజ్జును

# బందీ

విరామ మెరుగని విస్మయ వర్షర్తువు
- బాల్యం -లో తడిసి ముద్దైన నేను
ఇక పొడి బారేది చలి మంటల్లోనే కాబోలు!
దీపావళివాడూ
అమావ పిడికిట చిక్కిన పూరిళ్ళను చూసినా
అప్పుడవి నా బాణాసంచా మురిపెం మరుగున పడిపోయేవి.
ఇప్పుడా మురిపెమూ లేదు. ముల్లు మాత్రమే వుంది.
కార్తీకపు వేకువలో
చిటి గుప్పుట సెగలోపలి దాగినా
ఇరవై ఎనిమిది పళ్ళూ కథాకళి చేసేవి.
మాఘపు వజ్ర కవచంలో మా అమ్మ
చలి పంజా దాడిని అనాయాసంగా ఎదుర్కొంటుంటే
అబ్బురపడిపోయేవాణ్ని!
పై పూరి మంచి ఫయవించే వచ్చే అరటి దొప్పల్లో
అప్పటికే కొన్ని మరిగిపోయేవి,
అచ్చం మనుషుల్లాగా -
పుటక ఒకటే అయినా బతుకులు వేరైనట్టు!
కారువలువు అద్దంలా కాలక!
కాంతుల బిడారులా కాలవ!
ఆ బిడారులో నన్ను విడుచుకున్నాకనే
ఇల్లు చేరి తిరిగి మునుగు తన్నేవాణ్ని!!
మొలకను మానంతైనా
ఇప్పటికీ నేనంతే,
ఆ రెండు పేటల తాడు -
వెలుగుల సరసనే మలిగే బతుకూ,
చీకటిలో సాగి, సాగి సొలసే అన్వేషణా - తో
నిత్య బందీనుణ్ని!

— 'వి-రాగి'



యెంపర్లాడుతా నాక్కుండాయి.

''దున్నపోతులమ్ముదాములే నాయినా. వుత్తగా టికి కట్టేసి వూరకనే దాండ్ల పానం యాలదియ్యల్ల" దున్నపోతుల్ని జూస్తా అన్నాడు లింగన్న.

"అమ్ముకుంటే రేప్పర్దన చెర్లేకి నీళ్ళొత్తే మడిక య్యలు దున్నుకోడం శానా కష్టమయి తుందప్పా. ఆ బురదలో యిట్లుండే గిత్తలు యాడ పీకులాడ తాయి. యెట్లనో యింగా కొన్నాల్లు తట్టుకుంటే వానాకుండానే పోతుందా" సర్ది చెప్పినాడు మల్లప్ప.

మల్లప్ప పెండ్లాం నారమ్మ వూరి బండమింద గంప నిండా వొడ్లు దంచుకొని ముడిబియ్యం జేసు కొనొచ్చింది. సన్నకూతురు నాగమ్మ వొరిపొట్టు గంప నెత్తిమింది కెత్తుకుని, బుజం మింద రోకలి బెట్టుకోనొచ్చి గాటిపాట్న వొరిపొట్టు పోసింది. పసులన్నీ వొరిపొట్టు దినడానికి యెంపర్లాడ తాంటే చూసి, ''అయ్యో, యివేమి నాయినా వొరిపొట్టు గుడా తింటాండాయి''అని అడిగింది.

"ఆకలి సెబ్బరమ్మా. తినకేం జేత్తాయి" అంటా మల్లప్ప నిట్టూరిసి నాడు.

"యెనుంపడ్డ వొంటి పూట గూడా సరిగ్గా పొలీడంలే. యాడన్నా బదులో సదులో దెచ్చి ఆ కాలవ కింద పల్లెల్లో గెడ్డమ్ము తాండా రంట, పాయి పనకనిండా యేసుకోనన్నా రాగు డదా. అదీ యెండిపొయ్యిందంటే గలాసుడు మజ్జిగ నీళ్ళు గూడా దొరకవు'' యెసిట్లేకి నీళ్ళు బోస్తా యెచ్చరిచ్చింది నారమ్మ.

"యాడిప్పిచ్చుక రమ్మంటావ్? ఇప్పిచ్చుకొత్తే తీర్చేదెట్ల? పనులన్నా వుంటే కూలో నాలో బొయి తీర్చచ్చు. అవీ లేక పాయ'' బేజారుగా మాట్లాడ్నాడు మల్లప్ప.

''ఆ కంకర మిసనోళ్ళు యింగొగ మిసనేసిరారంట. నడపొన్నిగుడా యెట్లోగట్ల చేరిపిచ్చుగూడదా? యేదో వాడూ యింత చేతికి తెచ్చిత్తే యిల్లా కర్చులకు రాదా'' ''యాడా పనుల్లేక కట్టకింద పల్లెలోల్లంతా కంకర మిషను కంకర మిషనంటా యెగబడతాండారు. పెద్దోన్నిరికిచ్చుడానికే సాలయిపోయ. వాళ్ళు మాత్తరం యెంత మందినని తీసుకుంటారు? ఈటికే మున్నూరు మందయినారంట. యెగబడి పోతాఉండే జనాన్ని జూసి ఆ నా కొడుకులు ఇరవై యిచ్చే కూలి పదైదే చేసినారంట. పనంటే సందకాడదంకా పీజారగొడతారంట. పొద్దస్తమానమూ రాళ్ళు మొయిడమంటే మాట్లా, పెద్దోన్ని గూడా యెక్కడా గతిలేక పంపర్సిందే... యేందో, యేదిగే పిల్లనాయాళ్ళకు యేమిగతి పట్నో?'' బాదపడ్నాడు మల్లప్ప.

గాటిపాట్న ఆవుదూడ 'అంబా' అని అరిసింది. లింగన్న పాయిలోకి కట్టెపుల్లలు తెగ్గొడతాండాడు. మల్లప్ప పైకిలేసి కొట్టంలేకి పొయినాడు. ఆవుదూడ ఆకిలికి తట్టుకోలేక తలుగు దెంచుకోడానికి గుంజులాడతాంది. మల్లప్పను జూసి తలకాయూపింది. గిత్తలు పండుకొని మూతులెనిక్కి దిప్పి నేలకానిచ్చి దీనంగా చెవులు గొట్టుకుంటాండాయి. మల్లప్ప పైకి జూసినాడు. కొట్టం తొర్రలన్నీ కనిపిస్తాండాయి. గెడ్డేసుకుండే అట్టవంతా కాళీగా వుంది. గాట్లో గెడ్డిపుల్ల లేదు. చిదుగంతా కోళ్ళు కెదురుతాండాయి. మల్లప్ప మనసంతా యికలమయింది. మవునంగా వచ్చి అరుగుమింద కూచ్చోని ఆలోచిస్తాండాడు.

కానుపుకు పుట్నింటికొచ్చిన సుబ్బమ్మ పాయిలేకి పుల్లలేగేస్తాంది. సన్న కొడుకు యెగుర్లాడ తాండాడు. కొండన్న మరవంకలో నుంచి నీళ్ళ కడవెత్తకొచ్చినాడు. నాగమ్మ రోట్లో చింతకాయి తొక్కు నూరుతాంది.

''వోరా పడిపోడా, తాడూ, కొడవల్లిక్కి తీసుకోరా" మల్లప్ప కొండన్నకు జెప్పినాడు.

''ఇయ్యాలప్పుడెందుకు నాయినా" అర్తం గాక అడిగినాడు కొండన్న.

"నువ్వూ సన్నోడూ బొయి చేన్లో వాగ సద్దక్కిడి నరుక్కోని, మోపుగట్టుకొని రాపొండి"

మల్లప్ప చెప్పతానే అందరూ నమ్మలేక పొయినారు.

''సద్దదంట్లు పొట్టతో వుండాయి నాయినా. యింతలో వానొస్తే యెండినవి యెండిపాయినా ఆ తోగ దంటు ఆ తోగ దంటు కంకులయితే నాలుగుమూట్లు సద్దగింజలయితాయి. యెట్ల కొట్టకొచ్చేది నాయినా?''

గర్భిని మనిసి సుబ్బమ్మ యిచార పడింది.

"వానొచ్చి సద్దదంట్లు పచ్చగయ్యేలోపల పసులు సచ్చిపోతాయ్రా. నా మాటినండి" మల్లప్ప గొంతు జీరబొయ్యింది. కొండన్న తటపటాయిచ్చినాడు. లింగన్న లోపలికి బొయి కొడవలి తెచ్చి, "పొయి రాపొండప్పా, వూరకనే వానకు జూపెట్టుకొని పసర్ని జంపుకోడమేల" అంటా తమ్ముని చేతికిచ్చినాడు. నడిపోడూ, సన్నోడూ బిరబిరా చేనికల్ల పొయినారు.

* * *


ఉత్తర కార్తి నడికొనింది. ఉరుములు మెరుపులతో వాన దిగింది. నాలుగు రాత్రుల్లు వరసబెట్ట వాంచింది. బూమంతా కలకల్లాడింది. పొలాలన్నీ రోంత రోంత పచ్చగయినాయి. పేను కొరిగిన జుట్టు మాదిరి శెనిక్కాయి అడింతాడంత గుంపులు గుంపులుగా కనిపిస్తాంది. జనమంతా పొలాల్లో చీమలు పొరాడినట్ల పొరాడుతాండారు. సోదినపల్లిలో కొత్త సంబరం తొంగి సూస్తాంది.

చెర్లేకి నాలుగు నెల్ల నీళ్ళొచ్చినాయి. కట్ట కింద పల్లెలోల్లంతా చెంగన మాల తలబాల కట్టకడా కల్సినారు. కాలవలు దీసుకోని నాలుగు దినాల్లో తూము లెత్తి నార్లు బోసుకోడానికి తీరుమానించినారు. చెర్లో నీళ్ళనకంగా వుండాయి కాబట్టి యెవురేగానీ నాల్లొచ్చేదంకా శాడకేసుకోగూడదని కట్టుదిట్టం జేసినారు. దిగవ బూములోల్లకు నీళ్ళు సక్రమంగా నడిపేకి పదితీర్ల కొగడు నీరు గట్టోడుండల్లని మాట్లాడుకుంటారు.

చెరువుకాడ గంగమ్మను జేసి తూములెత్తినారు. కాలవలకు నీళ్ళొచ్చినాయి. పిల్ల కాలవలగుండా పరువెత్తుతాండాయి. లింగన్నా కొండన్నా కాలవ ఐరంటి నీళ్ళు వదుపుతా పోతాండారు. మడి మేరగెనుం మింద గుచ్చొని మడక్కి ఈత మోకేస్తాండాడు మల్లప్ప.

నీళ్ళు 'జటాల' మడి మొదటి కయ్యిలేకి పడ్నాయి. నారమ్మ బువ్వ గంపెత్తుకొని వచ్చింది. నాగులు కడవనిండా నీళ్ళు మోసుకోనొచ్చింది. కయ్యిలోబడిన నీళ్ళను జూస్తానే మల్లప్ప మొగమంతా కలకలలాడింది. చేత్తో నోట్లోకి నీళ్ళు బోసుకుని పుక్కిలిచ్చినాడు.

లింగన్న మడక నగలు తూరుపు దిక్కు దిప్పి దున్నపోతుల్ని దెగ్గిరికి తోలుకొని 'సామీ రామా' అంటా కాడిమానెత్తి పోతుల మెడమింద బెట్టి మడక గట్టినాడు. నాగులందిచ్చిన పసుపు గుంకుమ కాడిమానికి పూసి నగల మింద టెంకాయ గొట్టి మడకను ముందుకు




సాగదోల్నాడు. కొండన్న పార దీసుకొని గెనాలు కొట్టి తీరు బండ సరిగ్గా కూచ్చోబెట్టి తగ్గులు మిట్టలు పారతో కలేసినాడు.

నాలుగు కయ్యిలు దున్ని మడక నిలబెట్నాడు లింగన్న. అందురూ మొగాలు కడుక్కోనొచ్చి కూచ్చుండారు. నారమ్మ తలాకొక రాగిముద్ద చేతికందిచ్చింది. అందురూ ముద్ద మద్దెలో గుంత జేసుకుండారు. నాగులు అలసందల పులుసు ముద్దగుంతలో బోసి చిటికెడంత చింతకాయి తొక్కు పక్కన బెట్టింది. అందురూ సంతోసంగా తినుకుంటా మాట్లాడుకుంటాండారు. మడి మడి కాడా గుంపులు గుంపులు కూచ్చోని వొగర్నొగరు పిలుచుకుంటా అమ్మిడి పొద్దు బువ్వ తింటాంటే సుట్టూరా చూస్తా నారమ్మ నేల తల్లి పొంగినట్ల పొంగి పొయ్యింది.

నాలుగు దినాలయ్యింది. మల్లప్ప రెండెకరాలకు రొండు పొట్టు జల్లల్లో పోసిన పల్లవొడ్ల మలక బొగుసొగుసుగా వొచ్చింది. లింగన్నా కొండన్నా నారకయ్యిలు పిట్టకేసి పెల్లదొక్కినారు. మల్లప్ప పొకుమాను దిప్పి అర్దం మాదిరి జేసి కాడిడిసినాడు. మొదిటి కయ్యి మూలలో తీరు పక్కన బురదతో మూడు బొమ్మప్పలు జేసి పెట్నాడు లింగన్న. కొండన్న పుటకలో వుండే మలక దీసుకొని నవ్వుతా బొమ్మప్పల దెగ్గిర మూడు కుప్పలు బోసినాడు. మల్లప్ప వొడ్ల మలకను కండ్ల కద్దుకొని తూరుపు దిక్కు మొగం బెట్టి బూమిలేకి చల్లినాడు. మలక గింజలు కయ్యిల్లో ముత్తెపు గింజల్లా కల్ల, పూలవాన మాదిరి పడతాంటే కొడుకు లిద్దురూ చూస్తా నిలబడ్నారు. 'నెల కావొచ్చె. నాటొచ్చింది. పొట్టి రకాలు. నార బలిసిపోతే

పంట సరిగ్గా రాదు. అజా బాజా అంతా నాటు కుంటాండారు. యెట్లన్నాగానీ రొండు మూడు దినాల్లో నాటుకోవల్ల. నాటేముందు పిట్టకి కిందికి డి.ఏ.పీ. యేయ్యల్ల. రొండెకరాలకూ రొండు మూట్లన్నా కావల్ల. మడి నాటేకి యెకరాకు యిన్నూర్రుపాయలు వొప్పందమంట. చేతిలో నయాపైసా లేదు. యెట్ల జెయ్యల్లబ్బా - అలోచిస్తా మడికాట్నుంచి యింటి కొచ్చినాడు - మల్లప్ప. లింగన్నను బండి గట్టమన్నాడు. శింగనమాలకు యెల్లవార్నారు.

శేషయ్య కొత్తింటి దెగ్గిర రైతులంతా సుట్టు కుండారు. పక్క నుండే గోడోన్లో నుంచీ శేషయ్య కొడుకు ఎరువుల మూట లెత్తిస్తుండాడు. శేషయ్య పరుపు మింద సేటు మాదిరి కూచ్చోని గోడ కానుకుని మాట్లాడతాండాడు. పక్కనున్న గుమాస్తా రైతులతో బుక్కులో సంతకాలూ, బొట్నేలి వొప్పితాలూ చెయిచ్చుకుంటాండాడు. మల్లప్ప మెల్లగా బొయి కుచ్చుండాడు.

"ఏం మల్లప్పా బాగుండావా?" ఆదరంగా పలకరిచ్చినాడు శేషయ్య.

"ఏం బాగాలేయ్యా, రైతుల బాగు వొగిటే బాగే" బేజారుగా చెప్పినాడు మల్లప్ప.

"యింగేమప్పా చెర్లేకి నీళ్ళొచ్చినాయి గదా. ఫర్వాలేదులే... యేమొడ్లు బోసినావు?"

"అంసలు బోసినామయ్యా"

'అంసలయితే బాగుంటుందిలే. రోంత మందు లెక్కువ గొట్టుకొని, రెండు మూడుసార్లు యూరియా యేసుకుంటే మంచి పంటయితాది... నాటేదింగా ఆలస్యమా?"

"లేదయ్యా, రొండు మూడు దినాల్లో నాటల్ల. అందుకోసరమే వొస్తిమి"

"యెరువులు దొరకడం శానా కష్టంగా వుంది మల్లప్పా. మీయట్లా ముఖ్యమయిన రైతులొస్తే వాపసు పంపడం బాగుండదని వున్న దాంట్లోనే అందరికీ సర్దుతాండా. యెన్ని మూటలు గావల్లా?"

"యిప్పుడాలీకి రొండు మూట్లు డి.ఏ.పీ. కావల్లయ్య. మల్లా వొగ నెల బోయినంక రొండు మూట్లు యూరియా గావల్ల."

"మొత్తం నాలుగు మూటలన్న మాట. పర్వాలేదులే. అయితే అంతా యిప్పుడే తీసుకొనిపో. మల్లా దొరుకుతుందో లేదో చెప్పలేను."

"సరేలేయ్యా.... మల్ల రేపెట్లనో"

"అనంతపురం రేటు మీకు తెలిసే వుంటుంది గదప్పా. అక్కన్నుంచీ యీటికి రావల్లంటే మాకూ ఖర్చులుండాయి గదా. అందుకే ఐదు రూపా

## కటకటాల వెనుక శూన్య నేత్రాలు

ఏదో కోల్పోతున్నాను, సూర్యుడు కాంతిని కోల్పోతున్నట్టు
చెట్టు ఆకులను కోల్పోతున్నట్టు
ఆత్మ శరీరాన్ని కోల్పోతున్నట్టు
కోల్పోవడమే పునర్నిర్మింపబడేందుకు పునాది అని సిద్ధాంతీకరిస్తూ —
పిడికెడు గుండెలో దుఃఖం తుఫానై గర్జించినపుడు,
మౌనంగా తలవంచుకుని ఒంటరి బాటపై నడచి నడచి
నీలోనుండి నేనై, నాలో నుండి నేనే ఐ
నిశ్శబ్దాన్ని కోటి గర్జనల సంకేతంగా ధరించి
ఈ దేశపు వీధులను విశ్లేషిస్తున్నాను ఈ రాత్రి —
పాలరాతి గోడల వెనుక దుఃఖం వినిపిస్తోంది
చీకిపోయిన గుడిసెల గుండెల్లో దుఃఖం వినిపిస్తోంది
నవ్వే నీ కన్నుల్లో దుఃఖం ధ్వనిస్తోంది
భీకర బీభత్స దురాక్రమణల రాక్షసహోసాల్లో నుండీ దుఃఖమే వినిపిస్తోంది —
విశ్వవిద్యాలయాల్లో దుఃఖం,
అడవుల్లో దుఃఖం,
చెప్పులు విసరబడ్డ శాసనసభా వేదికలపై దుఃఖం,
కటకటాల వెనుక శూన్య నేత్రాల్లో దుఃఖం —
దుఃఖం ప్రశ్నిస్తోంది
ఈ నిశ్శబ్ద రాత్రులను,
వేశ్యల్లా తిరాలను భరిస్తున్న రోడ్లను,
నినదిస్తున్న జ్వలితారణ్యాలను
"ఎక్కడ జరుగుతున్నది ద్రోహం
ఎక్కడ జరుగుతున్నది, నేరం
ఎక్కడ ఈ తరం దోపిడీ చేయబడుతున్నది —"
నీవు నిద్రిస్తూంటావు
అగ్గిపుల్లతో కాల్చి నిన్ను మేల్కొలుపుతాను
నీలో ఓ అగ్ని బీజాన్ని నాటి
జ్వలించడం నేర్పి, జ్వలింపజేయడం నేర్పి
పాదాలపై నిలబడి శిరస్సును జెండాలా ఎగరేయడం నేర్పి
'ప్రశ్నించడం' నీ హక్కుగా గుర్తింప జేస్తాను
అగ్నిబిందువు పరివ్యాప్తమై
జ్వాలలా విస్తరిస్తూ, దహిస్తూ విక్రమిస్తూంటే
'భయాన్ని' జయించడం నేర్పి
ధ్వంసమౌతూ ధ్వంసమౌతూ ధ్వంసంచేయడం నేర్పి
నీలోని నిజమైన నిన్ను నీవు తెలుసుకోవడం ప్రారంభం కాగానే
నడుస్తున్న చేతిలో నుండి నా వ్రేలును వెనక్కు లాక్కుని
నిష్క్రమిస్తాను నీలో 'నడకను' — మిగిల్చి

రామా చంద్రమౌళి

యిలెక్కువ బెట్నాం'

"ఐదు రూపాయిలేమయ్యా..."

"ఐదు రూపాయిలకేమొస్తుందప్పా? లోడింగూ అన్లోడింగూ జెయ్యలంటే మూటకు రెండ్రూపాయలు దీసుకుంటారు. ఇంగ లారీ బాడుగ లేమీ, ఖర్చులేమీ, ఆఫీసర్లకు లంచాలేమీ అన్నీ లెక్కేసుకుంటే నష్టమొస్తాది. నష్టమో, లాభమో ముఖ్యమయిన రైతుల్ని పోగొట్టుకో లేంగదప్పా"

"కాలం శానా కష్టంగా వుందయ్యా. వొడ్డీ అన్నా రొంత చూసేసుకో"

"నేనూ రైతునే గదప్పా. నాకు మాత్రం తెలీదా? పక్కనోళ్ళు మూడ్రుపాయలేసుకుంటాంతారు. నాకంతన్నాయ మొద్దు. మూట కొగ మందు డబ్బా తీసుకో. రెండ్రుపాయలే యేసుకుంటాను".

మందు డబ్బాలంటేనే మల్లప్పకు బయమయ్యింది. శేషయ్య సెట్టి తిరకాసంతా అర్థమయింది.

'మందు డబ్బాలొద్దంటే వొడ్డీ మూడ్రుపాయి లేసుకుంటాడేమో! తీసుకుందామంటే దాండ్ల దుంపతెగ దిక్కులేని రేటు కొల్లబొయినాయి. కర్చుగానివన్నీ యితగాళ్ల యెంత సులబంగా మావా తన కొల్లబెడతారప్పా. యిగితంటే యీళ్ళదే యిగితి— యేం జేత్తాం, జుట్టు వాళ్ల చేతికందిచ్చినాం. వాళ్లాడిచ్చినట్టు ఆడల్ల మల్ల!' మవునంగా మనసులో అనుకుంటూ 'సరేలేయ్యా... కాలం మీదా మాదా' అని వూకొట్నాడు మల్లప్ప. శేషయ్య పంటొస్తానే అప్పు కింద పంటను తన అంగిడికే తోలల్లని కరారు జేసినాడు.

మల్లప్ప నాలుగు యెరువుల మూట్లూ నాలుగు మందు డబ్బాలూ తీసుకొని గుమాస్తా దెగ్గిర బుక్కులో బొట్నేల్ని వొప్పితమేసి వూరికెల్లవాల్నాడు.

లింగన్న బండి దోల్తాండాడు. శెనిక్కాయికని తీసుకోందే యెరువులూ మందులూ యిప్పుడు తీసుకోండే యెరువులూ మందులూ అన్నీ కలిపి లెక్కేసినారు తండ్రీకొడుకులు. పదార్నూర్లయింది. వొడ్డీతో రెండు వేలు దాటుతుందని మదింపేసుకుంటాండు. ఇద్దురి మనుసులూ బరువయినాయి.

"ఈ శేషయ్య సెట్టిగాడు బొలే కొంపలు ముంచేవాడున్నట్లుండాడు నాయినా" బండి దోల్తా అన్నాడు లింగన్న.

"యాపారస్తులప్పా వాళ్లూ. వాళ్ల పనే అది" చెప్పినాడు మల్లప్ప.

"వానెమ్మ కడుపు గాలా, యేమి కట్టిచ్చినాడు నాయినా యిండ్లు"

"యెందుగ్గట్టీడప్పా! కష్టపడిన సొమ్మయితేగిదా



కనిపిచ్చేది! లక్షల్లక్షలు లాబాలొత్తావుంటే మల్ల యాడబెట్టుకుంటాడు? నాలుగు లక్షలయ్యిం దంట యింటికి"

"వొరి యీానెమ్మ... నాలుగు లక్షలూ" నోరు దెరిసినాడు లింగన్న. సందకాటికి బండి సోదిన పల్లికి చేరుకుంది.

బువ్వదిని పిల్లలంతా పండుకుండారు. మల్లప్ప మంచం మీద వాల్నాడు. నారమ్మ యింట్లో పనంతా సగిపెట్టొచ్చి పక్కన కుచ్చుంది. యెవురూ రోంత సేపు మాట్లాడలేదు.

"యేమట్లుండావ్?" మల్లప్పడిగినాడు.

"సన్నబిల్ల నాగులు పెద్దమనిసయింది. గుట్టుస పృుదు గాకుండా యింట్లోనే ముగిచ్చుకుందామని నేనుంటే ఆ సాకల్సాసవితి టాంటామేసింది. కడగొట్టు పిల్ల. కూచ్చోబెట్టకుంటే అందురూ యేమనుకుంటారో యేమో. సంసారం జూత్తే యిట్లంగలొత్తాంది. రేప్పద్దనికి యెసిట్లోకి లేవు" యిసయం జెప్పి దిగులుపడింది నారమ్మ. మల్లప్ప గుండెల్లో యేందో కుచ్చున్నట్లయింది.

రామయ్య విల్లరంగిట్లో చెక్క పెట్టిమీద గుచ్చోని చాట్లో వొడ్లు సెరుగుతుండాడు.

"యేందయ్యా శాట్లో వొడ్లు సగానికి సగం కిందికి సెరిగేత్తాండావ్" అంగడికొచ్చి నాయ మ్మఅడిగింది.

"అన్నీ వుత్త తాలుగింజలు పాపా. కావల్లంటే కిందబడిందేవి నువ్వే యెత్తుకొని పో"

"వాగుకు నువ్విచ్చిందీ వొడ్లేగిదయ్యా యివి, తాలుగింజలంటావ్!"

"యిట్లా వొడ్లు వేసిచ్చినానా! బాగా మాట్లా డతావే, బుద్దింలేందానా?"

"పేదోల్లమయ్యా మేమూ, మాకేడ బుద్దుం టుంది"

రామయ్య యింగేంమాట్లాడ్లేదు. కాయితంలో బెల్లం, కాపీ పొడి కట్టిచ్చినాడు. అయమ్మ గొణుక్కుంటూ యెల్లిపొయ్యింది. రామయ్య అదే పనిగా కిందికి సెరిగేసిన గింజలన్నీ డబ్బా కెత్తి మూట్లో బోసినాడు. మెల్లగా మల్లప్పొచ్చి కుచ్చుండాడు.

"యేం మల్లప్పా, నార బీకితివా?" మూటంగ డతా పలకరిచ్చినాడు రామయ్య.

"నువ్వు దయజూత్తే పీకేదే రామయ్యా" నవ్వుతా అన్నాడు మల్లప్ప.

"నా దయ యేముందప్పా, అంతా భగవంతుని దయ"

"ఎవురి దయో వొగరి దయ వుండల్లగి దయ్యా.... బొత్తిగా యింట్లో బూగింజల్లేవు. మడి నాటేకి చేతిలో పైసా లేదు. నాలుగు మూట్లొడ్లా వొగయిన్నారు లెక్కా సర్దురా మయ్యా. మళ్ల గోస్తానే యిత్తాను"

"మడి నాటేకి అయిన్నూర్లెందుకప్పా? యింట్లో పనికి బొయ్యే పిల్లోల్లుండారు గదా. బదులో సదులో చేసుకుని నాటుకోగూడదా. వూరికే బాకీ యాల జేస్తావు"

"నేనూ అట్లనే అనుకొంటినయ్యా ఈ నార్లు జూత్తే అందరివీ వొగేసారొచ్చి కాలబడె. బదులూ సదులూ చేసుకుండేదంకా వుంటే నార బలిసిపోతాది. అంబంలో కుంబమని సన్నపిల్ల పెద్దమనిషై యింట్లో గుచ్చుంది. పెద్దపా పేమో కానుపుకొచ్చింది. నెల్లు నిండి అప్పుడో యిప్పుడో తీర్తమాడే తట్లుంది. యింగ అదొగితే యింట్లో జేత్తుందా నాటేకి బోతుందా? మగపిల్ల నాయాళ్లంటే సన్నోడు బడికి బోతండాడు. తతిమ్మా యిద్దురూ మడి అదుజ్జేత్తాండారు. యింగెవురయ్యా బదులు జేసేది"

"ఇబ్బందులన్నీ వొగటే సారొచ్చినాయి గదప్పా.... సరే నీ యిష్టం. వొడ్లు నాలుగు మూటలు గాకుండా అయిదు మూటలెత్తు కొనిపో. నీకిస్తే యాటికిబోతాయ్? లెక్కే కొంతిబ్బందిగా వుంది"

"అయ్యో అట్లంటే యెట్లయ్యా? నారొచ్చింది, అన్నాయం జెయ్యద్దు"

"అదే మీతో వొచ్చిండేది. ముందుగా వొగ మాటన్నా చెప్పరు. తీరా గొంతుమింది కొచ్చి కుచ్చుంటారు.... సరే యెట్లోగట్ల జేస్తాను గానీ నగదిచ్చే దుడ్లకు నాగంటే గిట్టదు. సుంగిడయి తేనే' (సుంగిడి— ఒక రూపాయికి శేరు ప్రకారం ఎన్ని రూపాయిలు అప్పుగా తీసుకుంటే అన్ని శేర్లు వొడ్లు ఇవ్వడం)

సుంగిడంటానే మల్లప్ప రోంతసేపు తటప టాయిచ్చి 'సరే నీ యిష్టమయ్యా' అని బరువుగా నిట్టూర్చినాడు.

రామయ్య అంగిడి బాకీ కింద మున్నూర్రూ పాయిలు లెక్కజూపిచ్చి అయిదు నూర్లు చేతి కిచ్చి మొత్తం యెనిమిది నూర్లకు సుంగిడని చెప్పి నాలుగు మూటలొడ్లు నాగుకెత్తిచ్చినాడు. (నాగు— మూట వడ్లకు వడ్డీగా ఇరవై అయిదు శేర్లు అదనంగా ఇవ్వడం)

* * *

వొరినాట్లు పచ్చగయినాయి. అయితే చిత్తకా ర్తిలో చినుకు లేక శానా సచ్చిపాయినాయి. స్వాతి కార్తొచ్చింది. శెనిక్కాయి బీకి వోదికేసినారు. చెట్టుకు నాలుగైదు బుడ్డలు గూడా లేవు.

వానల్లేక కొరివితెగులొచ్చి ఆకంతా కుష్టిరోగి యేళ్లన్నీ ముడుసుకున్నట్టు ముడుసుకుంది.

కాయలన్నీ లొత్తలు.

మల్లప్ప శెనిక్కట్టే దొడ్లేకి తోలల్లనుకుండాడు. అంతలోనే తుపానొచ్చి నాలుగు దినాలు ముసురుబ ట్టింది. శెనిక్కట్టంతా పేడపేడయ్యింది. కష్టపడి దున్నిండే గిత్తల కడుపుగొట్టే నట్లయింది.

మల్లప్ప కొడుకులూ, బిడ్డలూ అంతా సుట్టు కొని శెనిక్కాయలు బీకినారు. పది మూట్లయి నాయి. ఆరబోసుకుని శింగనమాల శేషయ్య దెగ్గి రికి బండ్లో యేసుకపాయినారు. శేషయ్య శెనిక్కా యలు జూస్తానే పెదవులిరిసినాడు. కింటాలు యెనిమిది నూర్లేసుకుంటానన్నాడు. మల్లప్ప మూగోడయినాడు. శెనిక్కయాలు తూకమే సినారు. మూట కాయలు ముప్పై కేజీలు గూడా తూగలే. కండ్లీడుసుకోని చూస్తాండే మల్లప్పకు వెమ్ములిరిగినాయి. గుమాస్తా దుడ్లు లెక్కేసినాడు. రెండు వేలా నన్నూరయింది. వొడ్డీతో పాటు యెరువుల బాకీ పట్టకుని శేషయ్య, యిన్నూరుపాయిలు మల్లప్ప చేతిలో బెట్నాడు.

* *

వొరి మల్లన్నీ యెర్రబడ్నాయి. దోమ పోటొచ్చి యాలబడ్నాయి.

కోతలు మొదులయినాయి. మడిగోసి, పదు

క్కేసి, పదుగు పీకడానికి యెకరాకు రొండు మూటలొడ్లు పకారం మడిగోసేకి వొప్పిచ్చినాడు మల్లప్ప. కూలోళ్లు రేప్పద్దనే వస్తారు.

రాత్రి బార్దినే పొద్దయింది. సుబ్బమ్మకు నొప్పులొచ్చినాయి. నారమ్మ యెంపర్లాడతా నరసమ్మను పిల్చుకొచ్చింది. నరసమ్మ సుబ్బమ్మకు వుడుకు నీళ్లు బోయిచ్చింది. ఇంట్లో కంబాండ్లకు తాడు గట్టి తాటి మీద తెరగా రగ్గులేయిచ్చింది. తెరచాట్న నులక మంచమే యిచ్చి సుబ్బుల్ని మంచం మింద పండుకోబెట్టింది. వక్కాకేసుకున్నంత సేపయిందో లేదో బిడ్డ అరుపులు యినిపిచ్చినాయి. సుబ్బమ్మకు ఆడబిడ్డ పుట్టింది. ఇంతదంకా అక్క బాదపడతాంటే కాళ్లుగాలిన పిల్లి మాదిరి తిరిగిన రాముడూ నాగులూ అక్క పక్కన కండ్లు మూసుకొని కదలాడతాంటే పురిటి ముద్దను జూసి నవ్వుతాండారు. 'పద్దన్నే మీ బావకు జాబు రాయప్పా' అని రామునితో జెప్పి మల్లప్ప కంబిడి తీసుకొని పోయి పసల కొట్టంలో మంచం మింద పండుకుండాడు.

'మంచి కళ్లాల కాలం. పిల్లా జెల్లా అంతా మడికోతలకు బొయ్యింటే యెట్ల లేదన్నా అయిదారు మూట్లు వొడ్లు జమయిందు. బగవంతుడింగొక పద్దినాలు కండ్లు మూసుకోనుంటే బాగుండేది. యెట్లనోలే, కానుపన్నా సుకంగా అయ్యింది. అంతే సాలు' అనుకుంటా కునుకు దీసినాడు మల్లప్ప.

మాదిగి మారెప్ప కళ్ళమంతా అలికి రొండు తంగిడిపూలు పీక్కొచ్చి యేసినాడు. రాముడు జిల్లడ కొమ్మలు తెచ్చేసినాడు. మడికోత అయిపోయి మోపులు కళ్లంలేకొచ్చినాయి. పడుక్కేసుకుండారు. తొమ్మిది పసుల్ని తోలకొచ్చి మూడు బంతులుకట్టుకొని తిప్పినారు. పయిటాలకు బందు లిడిసినారు. పడుగంతా పీకేసరికి పొద్దు వాలింది. వొడ్లన్నీ కుప్పజేసినారు. లింగన్నా కొండన్నా చెరోపక్క నిలబడి నిండు చాటలు తీసుకొని చేతులు పైకెత్తి "పొలిగా పొలిగా, రారా గంగాల పొలరెడ్డీ" అని గాలిని పిలుస్తా వొడ్లు తూర్పు బోస్తాండారు. మాదిగి మారెప్ప తల కాయి మింద గోనిపట్ట కొప్పిరేసుకొని, పిడికట్టె చేతిలో బట్టుకొని, కిందికొంగి దండి కట్టు పక్కకు నూరుతాండాడు.

వొడ్లన్నీ తూరుపు బోసేదయిపొయ్యింది. లింగన్న వొడ్లను రాసిగి యెగేసి సుట్టూరా గెర్రి గీసి మొక్కొని రాసి మీద కొడవలి చెక్కినాడు.. మల్లప్ప నడికట్టు గట్టుకొని, రుమాల జుట్టుకొని నిండు రాసిలో నుంచి మూడు దోసెండ్ల వొడ్లు



తీసి చాట్లో బోస్తాంటే చూసి, 'దేవునికన్యాయం జెయ్యద్దన్నా. పెద్దోనివి. నీ కన్నీ తెలుసు. మామూలు పద్దతి వొదిలిపెట్టి దేవుని యినాం మూడు దోసెండ్లు దీస్తే యెట్ల? చాట బట్టుకొని మూడు చాట్ల నిండా తీయన్నా' అని చానప్ప గెట్టిగా చెప్పినాడు.

'ఈ అద్దువాన్నం పంటల్లో యేమి యినాములప్పా' అని గొనుగుతా మూడు చాట్ల నిండా వొడ్లు దీసి రాసి యెనికపక్క బెట్నాడు. 'అకిలాండ కోటి బ్రమ్మాండ నాయకా' అంటా దాసప్ప తిరుమంతరం జదివినాడు. తవ్వదీసుకొని మల్లప్ప కూలోళ్లకు నాలుగు మూట్లు కొలిచేసినాడు. గర్బిని మనసులిద్దరికి తలా తవ్వెడు కొంగులేకిబోసినాడు. కూలోళ్లంతా యెల్లిపోయినారు.

అయిగాళ్లొచ్చినారు. సుట్టుపక్కల కళ్లాలు జూసుకుంటా బిచ్చగాళ్లొచ్చినారు. కర్జికాయల గంపెత్తుకొని పుల్లయ్యొచ్చినాడు.

మల్లప్ప సాకలోళ్లకు రెండు మూట్లూ, మంగలోనికి అర్ధమూటా, నీరు గట్టోనికి అర్దమూటా మేర కొలిచేసినాడు. మిగిలిన రాసిని మూట్లకు నింపినారు. పదారు మూట్లయినాయి. మల్లప్ప పొనమున్న పీనిగయినాడు. అంగన్నా, కొండన్నా రాసి కిందున్న వొడ్లన్నీ కుప్పజేసినారు. చాటల్లో వుండే వొడ్ల కోసరం దాసప్పా, కుప్ప జేసిన పరిగల కోసరం బిచ్చగాళ్లా నీళ్లు మింగుతాండారు.

'సమ్మచ్చరమంతా పేదినీ, పిడక దినీ కన్నగ సొల్లు బడితే బగవంతుడిట్ల జేసె. కడుపు నింపని ఈ పంట కోసరం యింతమంది కాసుకుండారు. దేవుని దెగ్గిర్నుంచీ అందరూ రైతును పీక్క తినేవాళ్లే. యేమిడిదో...' అని బాధపడతా మల్లప్ప చాటల్లో వొడ్లు దాసప్ప దుప్పిట్లో బోసినాడు. పైట సర్దుకుంటా, వొగలు బడతా, 'యేం బావా, రొంత నాపక్క జూడు' అని పాటలు పాడతాండే పులిగమ్మకూ, జవుకిని వాయిస్తాండే ఆసాదికీ తల తవ్వెడొడ్లు పెట్నాడు. చాట్నిండా తీసకపొయి పుల్లయ్య గంపలో బోసి పిల్లోల్లకు కర్జికాయలు తీయిచ్చినాడు లింగన్న. మిగిలిండే వన్నీ దండి కట్టుకొట్టిన మారెప్ప కొదిలేసినాడు. కళ్లమయిపొయ్యింది.

వొడ్ల బండి వూర్లేకెల్లవారింది. రామయ్య యింటి ముందు నిలబడింది. లింగన్నా, కొండన్నా బండ్లో నుంచీ పది మూటలు మోసకపొయి రామయ్య యింట్లో యేసినారు. మూట లెంచుకొని "యింగా మూడు మూట్లు రావల్ల మల్లప్పా" అని ఆదుర్దాగా అడిగినాడు రామయ్య.

"పంట శానా అద్దుమానంగా అయింది రామయ్యా. అన్నీ యేసిపోతే మల్లా పద్దినాలకే నీ దెగ్గిరికి రావల్ల. కూలో నాలో జేసి తీరుత్తాములే" మల్లప్ప ప్రాధేయపడ్నాడు. "అట్ల బాగుండదప్పా. సుంగిడికీ, నాకూ యిచ్చిండే గింజలు నిలుపుకుంటే యెట్ల? కాబడితే రేపే రా, యెన్నిగావల్లంటే అన్ని తీసుకపోదువు. ఇప్పుడు మాత్రం ఇయ్యల్సినవన్నీ సుస్తా జేసిపో" రామయ్య కతికిచ్చి మాట్లాడినాడు. ఆ మాటలు లింగన్న దొమ్మల్లో గుద్దినట్లయినాయి. కొండన్న రగతం పిండినట్లయినాయి. పండ్లు నూరుతా యిద్దురూ మిగతా మూడు మూట్లూ యెత్తకపొయి యిత్తగిర్సినారు.

రామయ్య యింటి నిండా వొడ్లే. ఇండ్లు బట్టక బయట అరుగుల మిందన్నీ వొడ్లే. చూస్తాండే ఆ తండ్రీ కొడుకుల గుండెల్లో బూమి తల్లి మోయ లేనంత బరువు.

మూడొడ్ల మూట్లతో బండి యింటి కొచ్చింది. సుబ్బమ్మ పక్కన ఆకలై తండ్లాడతాండే పురిటి బిడ్డ 'కేర్ కేర్' మంటా అరిసింది. బండిని జూస్తానే నారమ్మ కండ్ల నిండా నీళ్లు గార్సింది.

"సొంందరుకేడుత్తావే తిక్కదానా? మన కష్ట మింతే" అని మల్లప్ప వొల్లిగుడ్డ కిందికేసి అరుగు మింద గుచ్చుండాడు.

*   *   *

వెలెల్లిపొయ్యింది. సుబ్బమ్మ తలకొంంగా, నడికట్టా యిప్పేసింది. అల్లుడొచ్చినాడు. శానా యిబ్బందిగా వుందని సుబ్బుల్ని పిల్సక పోతాన న్నాడు. మల్లప్ప శాగవమాలకు బొయి బిడ్డకు సీరా రవికా తెచ్చినాడు. నారమ్మ బేళ్లకేసింది. సందకాడ సుబ్బమ్మకు వొడి బియ్యం బెట్నారు. నారమ్మ బిడ్డెంట వూరికి బయుల్దేరింది. సుబ్బమ్మ కన్నీళ్లు తుడుసుకోని యెల్లవారింది.

లింగన్న మాట మింద మల్లప్ప రెండు మూడుసార్లు అనంతపురానికి పొయ్యొచ్చినాడు.

అయిదో దినానికి నారమ్మ తిరిగొచ్చింది.

రాత్రి బోజినాలయినంక అందరూ వాగసాట కుచ్చుండారు. శానా దీర్గంగా మాట్లాడతాం డారు.

"రొంతాలోసించండప్పా. పట్నమాసమంటే మాట్లుగాదు. దూరం కొండలు నున్నగానే కని పిత్తాయి. ఆటికి బోతే తప్ప తెల్దు. యెన్నో తరాలు ఈడ్నే గడిసిపొయినాయి"

"యెన్ని తరాలుగడిసిపోయినా బతుకేమో యిదేగిద నాయినా. యెన్నాల్లని యీ అగసాట్లు? టవుస్లో నాలుగెనుగ్గొడ్లు బెట్టుకొని బతకమ్మ. బేల్దారి పనికి పొయి నీడపాట్నుండి సందకాలికి యిరవయ్యో ముప్పయ్యో సంపాయిచ్చుకోమ్మ. ఈడిగి తిమ్మప్పోళ్ల బొయి నాలుగేండ్లు గాలే. ఓబిరెడ్డి మావోళ్లు బొయి రెండేండ్లన్నానిండలే. అప్పుడే వాగొగరు ఇరవై వేలా కట్ల యెనిక్కేసు కుండారు. అంతమాత్తరం బతుక్కలేమా" దెయిర్నం జేసినాడు లింగన్న.

"యాడ బతుకుంటే అదే మనూరు. ఈడే మన్నా బూడుసుకుండామా? ఈ బూమమ్మను నమ్ముకొని యేం బాగుపడ్నాము? వూరకనే యిడుండి యాల కుళ్లిపొయల్ల?" నారమ్మ తెగేసి మాట్లాడింది.

మల్లప్ప మవునంగా ఆలోచిస్తాండాడు. నలభై యేండ్ల బతుకు కండ్ల ముందు కనిపిచ్చింది. ఆ చేన్లూ, మళ్లూ, వానలూ, పంటలూ, సుంగిడీ, నాగూ, యెరువులూ, దాండ్ల మద్దెన తన తండ్రీ, తానూ, తన పెండ్లామూ, పిల్లలూ, అరుస్తాండే పసులూ అన్నీ కనిపిచ్చినాయి. సుట్టగాలికి సర్ద వొగుడు మాదిరి రొంతసేపు వూగులాడ్నాడు. కడాకు తేరుకుండాడు.

*   *   *

సంకురాత్తిరొచ్చింది. పొద్దు గమనం మారింది. చలి తగ్గింది. ఆకాశమంతా నిమ్మ లంగా వుంది

రోడ్డు మింద వరసగా నాలుగు బండ్లు ముందుకు కదుల్తాండాయి. ముందు పక్క మల్లప్ప బండి పోతా వుంది. లింగన్న వుషారుగా గిత్తల్ని అదిలిస్తాండాడు. తెల్లవారుతాంది. బండ్లకు యెనికపక్క తూరుపు దిక్కు నుంచి యెలుతురు యెన్నంటి వస్తాంది. చీకటంతా తొలిగిపోతాంది. అనంతపురం దెగ్గిర్లోనే కనిపిస్తాంది.

*

## సగటు మనిషి



అతడు కలల కుటీరంలో బ్రతుకుతూంటాడు!
అతడు ఆశల ఎండమావిలో
బ్రతుకు పానీయం త్రాగుతూంటాడు!
తన సమస్యలను మరిచేందుకతడు
ప్రపంచం సమస్యల గురించే మాట్లాడుతుంటాడు.
తన కోర్కెల గుర్రానికి ఒక కళ్ళెం కొందామని
విరిగిన రూపాయితో అతడు విఫల ప్రయత్నం చేస్తూంటాడు!
కుడి చేత్తో ఆత్మాభిమానాన్ని,
ఎడమ చేత్తో అణకువనీ పట్టుకుని
అతడు చీకటిపడ్డ సమాజం చుట్టూ తిరుగుతూంటాడు.
తిరిగిపోని అతిథుల్లాంటి
శారీరక, మానసిక రుగ్మతల నొదిలించేందుకు
అతి ఘోరంగా మొహమాట పడుతూంటాడు!
చిరిగిన జేబుల్లో సుఖాల్నేసుకు నడుస్తూ,
అవి జారి పడుతూ వుంటే,
మళ్ళీ మళ్ళీ తీసి జేబులో వేసుకుంటూంటాడు.
అప్పుడప్పుడూ తన పై మెట్టుకు
కాలూనడానికి యత్నించి
తన క్రింది మెట్టుకు జారుతూ వుంటాడు.
భార్యామణికో కోక, చెల్లాయికో రైక,
తమ్ముడికో పలక, మంచాని క్కాస్త నులక
కొనేందుకని ఒక్కోసారి తలను తాకట్టుపెట్టి,
దాన్ని విడిపించేందుకు
జీవితాన్నే తాకట్టు పెట్టేందు కుద్యుక్తుడౌతాడు!
తగ్గని రుణాల వ్రణాలతో,
మరణ పర్యంతం రణం చేస్తూనే వుంటాడు.
ఆత్మాభిమానం, ఆత్మవంచన పదాల మధ్య
గీతగీసి – మళ్ళీ తనే చెరిపేస్తూంటాడు.
జీవిత వైకుంఠపాళీలో
తానెక్కిన నిచ్చెన విరిగి ఆధారం ఒరిగి
కరాళనాగు నోట్లో పడుతూంటాడు!
సుడిగుండాల సంద్రంలో నావ నడుపుతూ,
అంబర వీధి తారల్ని లెక్క పెట్టగలనను కొంటాడు.
అతడి ఉచ్ఛ్వాస,
అతడూహిస్తున్న భాగ్య భవితవ్యం
అతడి నిశ్వాస,
అతడీదుస్తున్న నిర్భాగ్య వర్తమానం
వెరసి అతడి జీవితం,
చీకటి కక్కిన, వెలుతురు మింగిన ఓ చిక్కని ఆర్తగీతం!!

— ఏడిద కవీంద్ర